ప్రజాశక్తి

Vol. 2, no. 97

(Apr. 11, 1947)

బెజవాడ, 1947

Record no. 683

Prajāśakti

Vol. 2, no. 97

(Apr. 11, 1947)

Bejavāḍa, 1947

Record no. 683

Regd. No. 4486

4 పేజీలు అణా

ప్రజాశక్తి

కమ్యూనిస్టు దిన పత్రిక

సంపుటి 2] బెజవాడ 12—4—47 శనివారం [సంచిక 87

గాజుల్లంకలో పోలీసు కాల్పులు

గాజుల్లంక, ఏప్రియల్ 11

గతరాత్రి గాజుల్లంకలో రైతులపై పోలీసులు కాల్పులు కాల్చారనీ, ముగ్గురు చనిపోయారనీ తెలుస్తోంది. వివరాలు తెలియలేదు. గాజుల్లంక రైతుల భూములను చల్లపల్లి జమీందారు అక్రమించుకోవ చూడటమూ, దానిపై రైతులు ప్రతిఘటించడమూ, అక్కడ పోలీసులు కాపలా ఉండటమూ పాఠకులకు తెలిసిన విషయమే.

జయప్రకాశ్ నారాయణ్ ఆంధ్రదేశ సంచారం

విరమించుకొన్నట్లు ప్రకటన

బెజవాడ, ఏప్రియల్ 11

ఆంధ్రదేశంలో సంచారం చేయడానికై కార్యక్రమం వేసుకొన్న సోషలిస్టుపార్టీ కార్యదర్శి శ్రీ జయప్రకాశ్ నారాయణ్ తమ కార్యక్రమాన్ని విరమించుకుంటున్నట్లు ఒక ప్రకటన చేశారు. ఆయన బొంబాయి ప్రయాణమై వెళ్ళిపోయారు కూడా.

భారత స్వాతంత్ర్యానికి బ్రిటిష్ పెట్టుబడిదార్లే అడ్డం

బ్రిటిష్ మంత్రివర్గం సుముఖమేనట

ప్రార్థనా సభలో గాంధీజీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10

నేడు గాంధీజీ ప్రార్థనానంతర సభలో ఉపన్యసిస్తూ ఇలాచెప్పారు :

"నాకు ఒకమిత్రుడు వ్రాస్తూ "భారతీయులకు అధికారం ఒప్పచెప్పేందుకే కొత్త వైస్రాయి వచ్చాడనినానమ్మకం." అన్నారు. వైస్రాయి రాజకుటుంబంలోనివాడు. బ్రిటిష్ మంత్రివర్గము, బ్రిటిష్ ప్రజాభిప్రాయాన్ని వ్యక్తీకరిస్తున్నారు. వీరుయిరువురుభారతదేశ స్వాతంత్ర్యానికి సుముఖులే.

"ఇంక భారతదేశంలోని బ్రిటిష్ పెట్టుబడిదారుల్ని నమ్మరాదు. వారింకా పాతధోరణిలోనే వున్నారు. వారే భారతదేశంలో కల హోదా పెంచి లాభాలు పొందుతున్నారు. వారే వైస్రాయి సదభిప్రాయాన్ని భంగపరుస్తున్నారు" అని ఆయన వ్రాశారు. అది నిజమేఐతే, బ్రిటిష్ పెట్టుబడిదారులు అటు స్వదేశ ప్రజలకు, ఇటు మన దేశ ప్రజలకు కూడా అనువర్తులుగా ఉండదములేదు. శాంతియుతంగా భారతదేశాన్ని వొప్పచెప్పడంలో వైస్రాయికి తోడ్పడమని, మిత్రులులాగ దేశాన్ని విడిచిపోమని వారిని కోరుతున్నా.

"మనదేశ ప్రజలు విశ్వాసం కోల్పోరాదనీ ఎవరో సహుత్వం చూపారు గనుక మనమూ చూపాలనే ధోరణి చూపరాదనీ కోరుతున్నాను."

వైస్రాయితో నాయకుల చర్చలు

న్యూఢిల్లీ ఏప్రిల్ 10

ఇవాళ సాయంత్రం నాలుగు గంటలకు జనాబ్ జిన్నా వైస్రాయిని కలుసుకొని మూడు గంటలసేపు చర్చించారు.

వైస్రాయిదంపతులతో నేడు కృపలానీ దంపతులు విందారగించారు. విందుకు పూర్వమూ, తర్వాతా కృపలానీ వైస్రాయితో మాట్లాడాడు. జనరల్‌లార్డ్ ఇస్మేతో కూడ కృపలానీ మాట్లాడాడు.

కాంగ్రెస్‌వర్కింగ్‌కమిటీ సమావేశం ఏప్రిల్ 21 న

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10

కాంగ్రెస్ వర్కింగుకమిటీ ఏప్రిల్ 21 న సమావేశమౌతుందని తెలుస్తుంది. గాంధిగారికి ఇతర కాంగ్రెసు నాయకులకు జరిగిన సంభాషణలు, కాంగ్రెసు నాయకులకు వైస్రాయికి జరిగిన సంభాషణలు ఈ సమావేశంలో చర్చించుతారు.

ఇవాళ సాయంత్రం గాంధిజీని ప్రార్థనానంతరం కలిసికొని కృపలానీ, నెహ్రూ, పటేల్, ఆజాద్, రాజగోపాలాచారి, రాజేన్ బాబుగారలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను చర్చించారు.

పాకిస్తాన్ ఒక్కటే పరిష్కార మార్గం

మామ్‌దాత్ నవాబ్ ప్రకటన

లాహోర్, ఏప్రిల్ 10

పంజాబు ముస్లింలీగు అధ్యక్షుడు, ఖాన్ ఇఫ్తికార్‌హుస్సేన్ (మామ్‌దాత్ నవాబు) జిన్నాగారితో చర్చించడానికై ఢిల్లీకివెళ్ళారు. వెళుతూ వెళుతూ పత్రికా విలేఖరులతో ఇలా అన్నారు.

"పాకిస్తాన్ ఆశయాన్ని సాధించాలి అనే పంజాబు ముస్లింల ఆజ్ఞను గుర్తు ఉంచుకొని నేను ఇపుడు వెళుతున్నాను.

"కాంగ్రెసుకు లీగుకు ఒడంబడికకు ఒకే మార్గంవుంది. అది హిందూస్థాన్ పాకిస్తాన్ అవిభారతదేశాన్ని విభజించడమే. ముస్లింమెజారిటీ రాష్ట్రాంతో స్వతంత్రరాజ్యం ఏర్పరచడం (పాకిస్తాన్) వినా మేము దేనితోను సంతృప్తిపడం. కాంగ్రెసు-లీగులమధ్య ఒడంబడికకు ఎక్కువకాలం పట్టదని ఆశించుతున్నాము.

"ముస్లిములు బ్రిటిషువారి దాస్యంనుండి, హిందువుల దాస్యంనుండి విమోచనంపొందడానికి, పాకిస్తాన్ సమస్యపై కాంగ్రెస్ మంకుపట్టు అడ్డురాదని అట్లీ ప్రకటన చెబుతోంది. కాంగ్రెసు ఇప్పటికైనా వాస్తవిక పరిస్థితులను గమనించాలని నేను కోరుతున్నాను. కాంగ్రెసుకు ఇంతకన్నా మరో మార్గంలేదు."

చేస్తే లీగుమంత్రివర్గం ఏర్పడిపోతుందేమోననే భయంతో వారు దానిని అంగీకరించలేదు.

ప్రధానపార్టీలు రెండూ కలసి మెలసి కదలాలి

డాక్టరు పట్టాభిగారి ఉపన్యాసం

మచిలీపట్నం, ఏప్రిల్ [illegible]

నిన్నటి సాయంకాలం బహిరంగ సభలో ఉపన్యసిస్తూ డాక్టరు పట్టాభిగారు ఈ విధంగా చెప్పారు:

"దేశంలోని ప్రధాన పార్టీలు రెండూ తమకున్న విభేదాలు మరచి ఏకమై, రాబోయే మహాకార్యాచరణకు భుజం భుజం కలిపి పని చెయ్యాలి,

"మనం ఇప్పుడు శాంతంగా వుండాలి. ఒకచోట కూర్చుని, పరస్పర సందేహాలు పోగొట్టుకోవాలి. మనమిద్దరం ఒక్కటేననే భావంతో పని చెయ్యాలి.

"దేశం మొత్తంమీద మాటికి 24 గురువున్న ముస్లిములు వేరుపడతామంటే, పంజాబులో మాటికి 40 మంది వున్న హిందువులు వేరుపడతామనరాదని కాంగ్రెసు అభిప్రాయం. అయితే మళ్ళీ ఆ హిందూస్థాన్‌లోని ముస్లిములు మరల పాకిస్తాన్ కోరతారు. ఇలా హిందూస్థాన్‌లో పాకిస్తాన్, పాకిస్తాన్‌లో హిందూస్థాన్-ఇలా దీనికి అంతు ఏమిటి ?"

సిక్కులతో రాజీకి లీగ్ ఎప్పుడూ సిద్ధమే

కాంగ్రెస్‌తో రాజీవిషయం లేదు

లాహోర్, ఏప్రియల్ 10

ఇస్లామియా కాలేజీ పట్టప్రదానోత్సవంలో మాట్లాడుతూ తాత్కాలిక ప్రభుత్వ సభ్యులు గజన్‌ఫర్ అలీఖాన్ ఈ విధంగా ఉపన్యసించారు :

"పంజాబులో గవర్నరుపాలన సాగవలసిన పనిలేదు. ముస్లింలీగ్ ప్రభుత్వం నిర్వహించగలననంటుంది. వారికి ఎంత మెజారిటీ వుందనే సమస్యతో పనిలేదు. పెద్ద మెజారిటీవున్న మంత్రివర్గాలు మాత్రం స్థిరముగా వుంటాయని యెవరు చెప్పగలరు?

"ఇక అల్పసంఖ్యాకులకు మంత్రివర్గంలో స్థానాల విషయం. లీగు సిక్కులకు ఉదారమైన స్థానం ఇస్తానంది. వారు రాకపోతే తప్పు లీగుది కాదు.

"కాని, కాంగ్రెస్ విషయం అలాగకాదు. కాంగ్రెస్ అధికారంలో వున్న రాష్ట్రాంలో మిశ్రమ మంత్రివర్గాల నేర్పరచక పంజాబ్‌లో మిశ్రమ మంత్రివర్గం కావాలంటే ఎల్లాగ? హిందువులు మొదలగు అల్పసంఖ్యాకులు దేశంలో ఇతర ప్రాంతాలలో అల్పసంఖ్యాకులనుభవించే హక్కులన్నీ అనుభవిస్తారు.

"పంజాబులో 93 వ సెక్షన్ పాలన సాగుతే పంజాబు భవిష్యత్తు మార్పగలుగుతామని కొందరి భ్రమ. ఇప్పుడు ప్రభుత్వం ఏదివున్నా ముస్లిం అధికసంఖ్యాకుల హక్కులేమవుతాయి? దేశం అన్నిమూలలా వున్న పంజాబులోనూ అల్పసంఖ్యాకులకు హక్కులుంటాయి.

"పంజాబులో చట్టసమ్మతమైన ప్రభుత్వం సాగకుండా చేయడానికే ఎతలహోలు రేగగొట్టారు. దానిని నిరూపించేందుకు వలసినంత సాక్ష్యం నావద్దవుంది. ప్రారంభంలో ఆహ్వానించిన ప్రకారం ఇతర మతాల నాయకులు లీగునాయకులతో చేతులుకలిపి పనిచేసివుంటే ఈ కల్లోలాలు అదిలోనే ఆగిపోయేవి. అలా

ముస్లింలీగ్ మంత్రివర్గ నిర్మాణానికి మా వోట్లీయము

క్రిస్టియన్ నాయకుని ఖండన

లాహోరు, ఏప్రిల్ 9

పంజాబు అసెంబ్లీ స్పీకరూ, ఇండియన్ క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షుడూ అయిన యస్. పి. సింహ ఇలా ప్రకటించాడు.

"అధికారంలో వున్న ప్రభుత్వానికి శాంతిభద్రతలను కాపాడటంలో సహాయపడటం మా విధానం. కాని మా వోట్లు లీగ్ మంత్రివర్గం ఏర్పరచడానికి సహాయపడవు. ముస్లింలీగ్ పంజాబునంతా పాకిస్తాన్‌లో ఇముడ్చుకోవాలంటే మేము అంగీకరించం. నేను అఖండభారతదేశాన్ని కోరతాను. కాని, పంజాబు విభజనను లీగు అంగీకరించే పక్షంలో (ఆ విభజన ఆయా జాతులవారు గాని మరో మూడవపక్షం గాని నిర్ణయించవచ్చు) అపుడు పాకిస్తాన్‌కు అంగీకరిస్తాము. అలాంటి పాకిస్తాన్ ఇండియా ఐక్యతకు, శాంతికి దారితీస్తుంది."

దివాన్‌బహదూర్ యస్. పి. సింహ, మహాత్మాగాంధీ, పటేల్ జిన్నా, కృపలానీ గార్లను కలుసుకోడానికి ఢిల్లీ వెళుతున్నారు.

పంజాబ్ కాంగ్రెస్ శాసనసభ సమావేశం

లాహోర్, ఏప్రిల్ 10

రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితిని చర్చించడానికై ఏప్రిల్ 20 న కాంగ్రెసు శాసనసభ్యులసమావేశం జరుగుతుంది.

కోయంబత్తూరులో కార్మికులపై దౌర్జన్యం

8 గురు ప్రమాదదశలో వున్నారు

కోయంబత్తూరు, ఏప్రిల్ 9

నిన్నటిరోజున కోయంబత్తూరులోని రాధాకృష్ణ మిల్లులలో ఎర్రజెండా యూనియన్ కార్మికుని కొందరు యజమాని రౌడీలు కొట్టారు. వెంటనే యూనియను కార్మికులు ఆత్మరక్షణకు ఎదురుతిరిగారు. కలహంలో యూనియన్ కార్మికులు 4గురు, ఒక రౌడీ, మరొక కార్మికుడు చాల తీవ్రమైన గాయాలు తగిలి హాస్పిటలుకు చేర్చబడ్డారు. వీరుగాక మరి 35 గురి వరకు దెబ్బలుతగిలాయి. ఈదౌర్జన్యాన్ని నిరసిస్తూ కార్మికులు సమ్మె ప్రారంభించారు. మిల్లు మూతబడిపోయింది. పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

బకింగ్‌హామ్ సమ్మెపై మద్రాస్‌మంత్రులపట్టు

కార్మికనాయకుని విడుదలకు అసమ్మతి

మద్రాసు, ఏప్రిలు 10

బకింగ్‌హాం మిల్లు కార్మికులు సమ్మె ముగించడానికి ముందు మద్రాసు ప్రభుత్వం కార్మిక నాయకుడు అంతోనీ పిళ్ళెను విడుదల చేయాలని కోరారు. అదమం ఆయనను రాజమండ్రి జైలునుండి మద్రాసుకు మార్చి, కార్మికులు సంప్రదించేటందుకు సౌకర్యాలు ఇవ్వాలని కోరారు.

కాని మద్రాసు ప్రధానీ, కార్మిక మంత్రి రాజన్‌కూడా ఈ రెండు పద్ధతులనూ నిరాకరించారు. కార్మికులు ముందు సమ్మెమాని బ్రిటిష్ యజమానులకు 'దాసోహం'అంటేనే పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నట్లు చెప్పారు. రాజమండ్రీ జైలులో అంతోనీ పిళ్ళెను సంప్రదించడానికి వీల్కుమాత్రం కలిగిస్తారట!

ఇటువంటి భావాలతో పనిచేస్తూవున్న మద్రాస్ ప్రధాని రాష్ట్రంలో సమ్మెలులేకుండా చేసుకొనడానికి మే నెలలో యజమానుల — కార్మికుల ప్రతినిధులను సమావేశపరచదలచిస్తారట.. ఆ చర్చలలో ఆయన తీసుకొనే దృక్పథానికి ఇది మచ్చు కాబోలు!

అఖిల భారత పత్రికా సంపాదకుల మహాసభ

బొంబాయి, ఏప్రిల్ 10

అఖిలభారత పత్రికాసంపాదకుల మహాసభ ఏప్రిల్ 18 వ తేదీన సాయంకాలం మద్రాసులో ప్రారంభ మవుతుందని అఖిల భారత పత్రికాసంపాదకుల సంఘకార్యదర్శి తెలియజేస్తున్నారు.

పత్రికారచయితల స్థితిని బాగుపరచాలి

బళ్ళారిజిల్లా పత్రికారచయితల సంఘ తీర్మానం

బళ్ళారి, ఏప్రిల్ 10

బళ్ళారిలో నిన్నపరిశ్రమల, ప్రచారశాఖ మంత్రి హెచ్. సీతారామిరెడ్డిగారి అధ్యక్షతను బళ్ళారిజిల్లా పత్రికారచయితల సంఘ సమావేశం జరిగింది.

రాష్ట్రంలో జర్నలిస్టుల స్థితిగతులను గురించి విచారించుటకు ఒక కమిటీని నియమించి, ప్రపంచంలోని అభివృద్ధికర దేశాంలోని జర్నలిస్టులతో సరిసమానంగా మన దేశంలో కూడా జర్నలిస్టుల స్థితిని బాగుచేయవలసిందిగా మద్రాసు ప్రభుత్వాన్ని కోరుతూ ఒక తీర్మానాన్ని చేశారు.

డ్రయివరు హత్యకు సానుభూతి సమ్మె

కలకత్తాలో మునిసిపల్ మోటారు కార్మికుల నిర్ణయం

కలకత్తా, ఏప్రిల్ 9

కలకత్తా కార్పొరేషన్ మునిసిపల్ మోటారు కార్మికులు తమలో ఒక డ్రయివరును మతావేశపరులు పొడిచి చంపినందుకు అసమ్మతిగా 10 వ తేదీన సమ్మెచేయ నిర్ణయించారు. కార్పొరేషన్ ప్రధానోద్యోగి సమ్మె చేయవద్దని యిచ్చిన సలహాను కార్మికులు పాటించలేదు. మునిసిపల్ మోటారు కార్మికులు పట్టణారోగ్యాన్ని కాపాడడానికి ఆయుధపట్టు అనీ వారికి పట్టణవాసులంతా రక్షణ యివ్వాలనీ అధికార్యోగ్ని శ్వేత నగర వాసులకు విజ్ఞప్తి చేశారు.

గౌరవమైన సంధి చేసుకుందాం

లేకపోతే కల్లోలాలు తప్పవని సాదుల్లా

గౌహతి, ఏప్రిల్ 10

అస్సాంలో ముస్లింలీగ్ సత్యాగ్రహం చేయడానికి తీర్మానించిన అనంతరం మాజీ ప్రధాని సాదుల్లా నేడే మొట్టమొదటిమారు ఉపన్యాసం ఇస్తూ ఇలా చెప్పారు :

"గౌరవమైన సంధి చేసుకునేందుకై అస్సాం ప్రధాని గోపీనాధ బార్డొలాయ్‌తో చర్చలు సాగిస్తున్నా. లేకుంటే కల్లోలాలు తప్పవు.

"ఇంకా సత్యాగ్రహం ప్రారంభంకాలేదు. చర్చలు సాగించడానికి వీల్కున్నాయి.

"1940 లో నేనూ, రోహిణీచౌదరి, బార్డొలాయ్‌గార్లు కలిసి చేసుకొన్న అగ్రిమెంటును ఇప్పటిమంత్రులు అనుసరించడం లేదు.

"ఇంతవరకు వెళ్ళగొట్టబడిన 3500కుటుంబాలలో రక్షణ యివ్వవలసినవి 700 కుటుంబాలు మాత్రమే వున్నాయనీ, భూములనుండి లేవదీసినవారికై 27 వేల బీఘాల నేల కేటాయించామనీ బార్డొలాయ్ చెప్పారు. అయితే ఇంకకల్లోలమేలేదు, నేను చెప్పినట్లు ఆయన వొప్పుకుంటే వలసకాకుండా ఆపుతాను.

"అస్సాంలో ముస్లిములది మెజారిటీ కొండజాతి ప్రజలు, నిమ్నజాతులు హిందువులనుంచి మినహాయించాలి. ఏమంటే వారు వేరే జాతివారమంటున్నారు.

"ప్రస్తుత ప్రభుత్వంతో చేతగానితనం లంచగొండితనం, స్వజాత్యభిమానం విశేషంగావుంది.

"లీగు ప్రారంభించే పుద్యమం ఏజాతిమీద కాదు, ఒక వ్యక్తిమీద కాదు. ఒక అన్యాయ విధానం నిర్మూలించడానికి పోరాడుతుంది."

ప్రజాశక్తి

1947 ఏప్రియల్ 12 : శనివారం

నైజాం నవాబుకు బెజవాడ పోలీసు తోడ్పాటు

నైజాం ప్రభుత్వం కొత్తగూడెం బొగ్గు గని కార్మికులపైన తీవ్రమైన నిర్బంధ కాండను కొనసాగిస్తోంది. కార్మిక నాయకులలో ఒకరైన పి. చలపతిరావుగారు బెజవాడ వచ్చి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇది బ్రిటిషు పోలీసుల సాయంతో 5 వ తేదీన నైజాం పోలీసులు అక్రమంగా అరెస్టుచేసి, బేడీలువేసి నైజాం తీసుకుపోయారు.

హైదరాబాదు సంస్థానంలోని నిరంకుశ ప్రభుత్వ విధానాన్ని గురించి, మన తెలంగాణా సోదరులు పడుతున్న అగచాట్లను గురించి ప్రజలందరికీ తెలుసు. నైజాం నవాబు రెండువందల యేండ్లక్రింతం ఉత్తర సర్కారులను, రాయలసీమను బ్రిటిషు సామ్రాజ్యవాదులకు ధారాదత్తం చేశారు. అప్పటినుండీ మనం బ్రిటిషు దాస్యాన్ని అనుభవించుతున్నాం. తెలంగాణా సోదరులు నైజాం నవాబు నిరంకుశత్వాన్ని ఎదిరించి పోరాడుతుంటే బ్రిటిషు సామ్రాజ్యవాదులు ప్రజా ఉద్యమాలను అణచివేయడానికి నైజాం నవాబుకు సాయపడుతున్నారు.

నేడు మద్రాసు రాష్ట్రంలో, కాంగ్రెస్ మంత్రివర్గం ఉంది. ఈ సమయంలో తెలంగాణాలోని ప్రజానాయకులకు మద్రాసు రాష్ట్రంలో ఆశ్రయం యివ్వడం ప్రజామంత్రివర్గ కర్తవ్యాలలో ఒకటిగా ఉండాలి. నైజాం ప్రభుత్వ దమననీతిని నిరసించడంకూడా ప్రజా మంత్రులకు ధర్మం. ఏ సందర్భంలోనూ తెలంగాణా ప్రజా నాయకులను అరెస్టు చేయడానికి నిజాం పోలీసులకు బ్రిటిషు పోలీసులు సాయపడకుండా చూడడం ప్రజామంత్రుల ముఖ్య విధులలో ఒకటి.

బెజవాడ పోలీసులు తెలంగాణా కార్మిక నాయకుని అరెస్టు చేయడానికి సాయపడడం క్షమించరానిది. ఇదివరకు తాలికట్టులో తిరుమల్నాయుడు కార్మికనాయకుని యిలాగే అరెస్టు చేసినందుకు మేము తీవ్రమయిన అసమ్మతి తెలియజేశాం. రాష్ట్రప్రజలు అనేక సభలలో తీర్మానాలుచేసి మంత్రివర్గానికి తెలియజేశారు. కాని అందుకు కారకులైన పోలీసు అధికారులపైన ఎట్టి చర్యా తీసుకోలేదు. దీనిఫలితంగానే సామ్రాజ్యవాదులు, వారి నిరంకుశ ఉద్యోగ బృందం పోలీసులు, మనప్రజల స్వాతంత్ర్య పోరాటంపై తమ దాడిని కొనసాగిస్తూనే వున్నారు. అనాడు కేరళప్రజల స్వాతంత్ర్యంపై దెబ్బకొట్టడానికి తిరువాంకూరు కార్మికనాయకులను పట్టియిచ్చారు. నేడు నైజాం ప్రజల ఐక్య స్వాతంత్ర్య పోరాటంపై దెబ్బగొట్టడానికి, తెలంగాణా కార్మికనాయకులను, ఇంగ్లీషు సామ్రాజ్యవాదులు తమ పోలీసులచేత అరెస్టుచేసి, నిరంకుశ నైజాంకు అప్పజెప్పుతున్నారు.

భారతదేశాన్నుండి వెడిపడి, ఇంగ్లీషు సామ్రాజ్యవాదులతో ప్రత్యేక సంబంధాలు పెట్టుకొని, వారికి గులాంగా, మన భారత పరిసర్లలో ఇంగ్లీషుసైన్యాన్ని నిలబెట్టడానికి నైజాం నిరంకుశనవాబు ప్రయత్నాలు చేస్తున్నాడు. అట్టి నైజాంనవాబు దురాగతాలను, వానికి సాయంచేస్తూవున్న ఇంగ్లీషుసామ్రాజ్యవాద ఎత్తులను ఎదుర్కోవడం కాంగ్రెసు మంత్రివర్గం యొక్క కనీస కర్తవ్యం. లేదా మన ఆంధ్రప్రజల ఐక్య పోరాటానికి, మన తెలంగాణా సోదరులకు మనమే ద్రోహంచేసినవాళ్ళమవుతాం. మన భారత ప్రజల స్వాతంత్ర్యపోరాటాన్ని విచ్ఛిన్నంచేయడానికి నైజాంకు ఇంగ్లీషు సామ్రాజ్యవాదులకు మనమే తోడ్పడినవార మవుతాం.

అందుకే ఆంధ్రప్రజలందరూ యీ విషయమై తీవ్రమయిన ఆందోళన చేయాలని కోరుతున్నాం. ఆంధ్రదేశం మూలమూలలా సభలు చేసి తీర్మానాలు చేయాలి. మద్రాసు మంత్రివర్గం వెంటనే అరెస్టుఅయిన తెలంగాణా కార్మిక నాయకుని విడుదలచేయించాలని, నైజాంపోలీసులకు సాయపడిన బెజవాడ పోలీసుఅధికారులపై చర్య తీసుకోవాలని కోరుతున్నాం. సోదర పత్రికలు, సోదర పార్టీలు కాంగ్రెసు సంఘాలు దీనిపై తీవ్రఆందోళన చేయాలని కోరుతున్నాం.

ధాన్యం ధరలలో మార్పు

కొద్దిగా పెంచుతూ మద్రాసు ప్రభుత్వ ప్రకటన

మద్రాస్, మార్చి 10

మద్రాస్ ప్రభుత్వం ధాన్యం ధర రు ప్రస్తుతంకంటె మణుగు 1కి రు 0-4-0 పెంచుతూ నేడొక పత్రికా ప్రకటన చేసింది. దిమ్మకు తక్కువకాకుండా యిస్తే రైతుల నుండి బియ్యంకూడ తీసికోడానికి ప్రభుత్వం అంగీకరించింది. ప్రభుత్వ ప్రకటన క్రింది విధంగా ఉంది :

"1946-47 సంవత్సరంలో ధాన్యంధరలు ఏ మాత్రం పెంచబడవనీ, బోనసుకూడ ఇవ్వబడదనీ ప్రభుత్వం చాలసార్లు ప్రకటించింది. కాని రైతులు ఇంకా ధరలు సవరింపబడతాయనే ఆశతో ధాన్యం త్వరగా విడుదల చేయడంలేదని ప్రభుత్వం తెలిసికొన్నది. ఈ సంవత్సరం ధాన్యం ధరలు ఎంతమాత్రమూ పెంచరాదని కేంద్ర ప్రభుత్వం నిశ్చయించింది. మద్రాస్ కొరత రాష్ట్రమై బయటి సహాయంమీద ఆధారపడివున్నందున కేంద్ర ప్రభుత్వ నిర్ణయం విధిగా అంగీకరించింది. అందుచేత బియ్యంధరలు యిక ఏమాత్రమూ పెంచబడవని ప్రభుత్వం పునరుద్ఘాటిస్తున్నది.

కాని బియ్యం ధరలు పెంచకుండానే ధాన్యం ధరలు సవరించి రైతుకు మరికొంత అదనంగా లభింపజేసే అవకాశాన్నిగూర్చి ప్రభుత్వం పరిశీలించింది. ఉత్పత్తి కొనుగోలు సహకారసంఘాలు స్థాపించబడిన ఉత్తర జిల్లాలలోని రైతులు సంఘాలు లాభాలు పంచిపెట్టేవరకు వేచివుండటానికి ఇష్టపడడం లేదనే విషయం ప్రభుత్వ దృష్టికి తేబడింది. ప్రస్తుతం గ్రామాలలో నిర్ణయింపబడిన ధరలకంటె కొన్ని అణాలు అదనంగా సంఘాలు లాభాలు ప్రతిబస్తాకు పంచిపెట్టగలుగుతాయని ప్రభుత్వంసంతృప్తి చెందింది. ఆ ప్రకారం క్రింది విధంగా వెంటనే అమలుజరిగేటట్లు గ్రామాలలోనే వంచిలేకుండా ప్రతిబస్తాకు క్రిందివిధంగా ధాన్యం ధరలు నిర్ణయింపబడినాయి.

	2 మణుగుల ధాన్యం బస్తాకు ప్రస్తుతధర	సవరించిన ధర
మేలురకం	12- 0-0	12- 8-0
మొదటిరకం	10-14-0	11- 6-0
రెండవరకం	10- 0-0	10- 8-0
మూడవరకం	9- 4-0	9-12-0

"ఈ ధరలు మిగులు జిల్లాలైన తూర్పు గోదావరి, పడమరగోదావరి, కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాలకు వర్తిస్తాయి. నెల్లూరుజిల్లాలో సంఘాలు లేనందున మిల్లుదారులే ధాన్యం కొంటున్నారు. అందుచేత మేలురకం ధాన్యానికి మిల్లువద్దరేటు 2 మణుగుల బస్తా రు 13-8-0 లు ఉంటుంది. దక్షిణాదినున్న మిగులు జిల్లాలలోను, యితర లోటుగు జిల్లాలలోను ఈ సూచనలననుసరించి గ్రామాలలోను, మిల్లువద్ద ధాన్యం ధరలు పునర్నిర్ణయం చేయవలసినదిగా సివిల్‌సప్లయి కమిషనరుకు, ఆయా జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం సూచనలిచ్చింది. గ్రామంలో కాకుండా యితరచోట్లకు చేర్చవలసివస్తే రైతులకు బాడుగ ఇవ్వబడుతుంది.

"కొందరు రైతులు తమ పశువులకు తవుడు మిగుల్చుకోడానికి, మిల్లుదార్లుపొందే లాభంలో కొద్దో గొప్పో తాముకూడ పొందటానికి తామే బియ్యం సప్లయిచేయాలనికోరుతున్నారు. ఈసందర్భంలో కూడ 1 ఉమ్మ అనగా సుమారుగా 2 మణుగుల బరువుగల 13 బస్తాలబియ్యానికి తక్కువకాకుండా ఇవ్వగలిగిన రైతులనుండి బియ్యం తీసుకోడానికి నిశ్చయించింది. పైనచెప్పిన 5 మిగులు జిల్లాలలోనురైలుస్టేషనుకు చేర్చిన ప్రతి రెండు మణుగుల బియ్యం బస్తాకు క్రింది ధరలు యివ్వబడతాయి.

మేలురకం	19- 4-0
మొదటిరకం	17-12-0
రెండవరకం	16- 8-0
మూడవరకం	15- 6-6

"ప్రస్తుతంకరుగు జిల్లాలలోధాన్యంసేకరణ చాల తక్కువగా ఉన్నందున వర్షాలు ప్రారంభంకాక పూర్వమే అత్యధిక తరుగు కర్తీచేయవలసిన అవసరం వుందని ప్రభుత్వం రైతులకు స్పష్టపరుస్తున్నది. గత సంవత్సరం పంటలు పోయినపుడు కూడ ఉత్పత్తిదారుల సహకారంతో మన రాష్ట్రం కొరతలేకుండా బయటపడింది. ఈ సంవత్సరం పంటలు మెరుగుగా ఉన్నందున కొనుక్కుతినేవారిని ఉత్పత్తిదారులు బాధలకు గురికానివ్వరని ప్రభుత్వం విశ్వసిస్తున్నది. గతసాలుకంటె ధాన్యసేకరణఎక్కువగా జరగకపోతే యింతవరకు సంపాదించిన మంచి పేరు, ప్రపంచసానుభూతి మద్రాసు రాష్ట్రం కోల్పోతుంది.

"అందుచేత పరిస్థితులనుగమనించి గతంలాగానే ముందుకూడ తమ పూర్తిసహకారం యివ్వాలని ఉత్పత్తిదారులకు ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తున్నది."

పైధరలు ఎప్పటియిబర్ల కాలంనాటివిన్న బస్తాకు ఒక అణామాత్రం యెక్కువగా ఉన్నాయి. ఎప్పటినుండో రైతుసంఘాలు ఆందోళన చేస్తున్న రు 11 ల ధర ఇప్పుడు కూడ అంగీకరించబడలేదు. పోతే రైతులు కూడ బియ్యం రూపంలో యిచ్చే సౌకర్యం కల్పించారు. కాని బియ్యం చేయడానికి సంఘాలకు వలెనే రైతులకుకూడ మిల్లు సౌకర్యాలు ఉంటాయని చెప్పలేదు. బియ్యం ధరలు వర్తకుల కిచ్చేదానికంటె రైతుకు బస్తాకు 0-6-0 తగ్గించారు. ఈ విచక్షణకు కారణాలేమీ ప్రభుత్వ ప్రకటనలో పేర్కొనబడలేదు.

ఏటికట్టులేక ఏటా పంటనష్టం

గొందిపాలెం, ఏప్రిల్ 1

రాజోలు తాలూకా కొత్తపేట డివిజన్‌లో నైన లేయానది యొడ్డునున్న గన్నవరం నుండి దక్షిణముగా నున్న ఏటిగట్టు అసంపూర్తిగా నుండుటవల్ల రమారమి 7 వందల ఎకరముల పల్లం భూమి ప్రథమపంట వరదలవల్ల పూర్తిగా నష్టపోతున్నది. రెండవ పంట నీరు పూర్తిసప్లయి లేక అర్ధపంట పండుచున్నది. వరద ముంపువల్ల పంట నష్టమేగాక పైనలేయం కొత్తపల్లి పేరుతో నున్న 5 గ్రామాలు, ఏమగపల్లి పేరుతో నున్న 4 గ్రామములు కొత్తలంక పేరుతో నున్న 3 గ్రామాలు ముంగండపాలెంపేరుతో నున్న 2 గ్రామాలు మొత్తం 14 గ్రామాలకు కావలసిన సరకు దొరకక మనలుటకు తావు లేక పశువులకు మేతలేక నానాబాధలు పడుచున్నారు. ఈ బాధలు ప్రతి సంవత్సరం భరించలేక యీ గట్టును పొడిగించి అమలాపురం దగ్గర యీదరపల్లి దగ్గరనుండి బెండమూర్లంకవరకు పోయిన యేటిగట్టుకు కలుపవలసినదిగాను, ముంజవరం దగ్గర మురుగుకాల్వకు అక్లేరు కట్టవలసినదిగాను, ప్రభుత్వానికి మెమోరాండములు ఎన్ని పంపుకున్న యింతవరకూ మా మొరాలకించువారు లేరు ప్రజా ప్రభుత్వం యిప్పడయినా యీ గట్టుపని పూర్తిచేయాలని స్థానిక రైతుసంఘ అర్గనైజరు కదలి గంగిశెట్టిగారు వ్రాస్తున్నారు.

ఉచిత భోజనశాలల మూసివేత

గుడ్లవల్లేరు, ఏప్రియల్ 6

కృష్ణాజిల్లాలో దాదాపు 30 కేంద్రాలలో మద్రాసుప్రభుత్వ వర్క్‌బోర్డ్ సహాయంతో ఒక సంవత్సరంనుండి బీదవిద్యార్థులకు మధ్యాహ్నం ఉచిత భోజనశాలలు నడుపబడుతున్నవి. కాని, యివి గతనెలాఖరుతో ప్రభుత్వఆజ్ఞననుసరించి మూసివేయబడినవి. 1946 మార్చిలో 3800 మంది భోజనము చేస్తే 1947 మార్చిలో 5200 మంది భోజనము చేసినారు. పై లెక్కలు అద్భుతముగా పనిచేసిన గుడ్లవల్లేరు సెంటర్‌లోనివి. వీటి వలన విద్యార్థులు ఏమి నేర్చుకొన్నదీ ఈ క్రింద వివరిస్తాను.

(1) కుల మత భేదాలు లేకుండా, అంతా ఒకే పంక్తిని కూర్చొని భోజనము చేయుట.

(2) మధ్యాహ్నము ఇంటికివెళ్ళే శ్రమ లేకుండాచేయబడినది.

(3) బీద పిల్లలు చదువుకొనుటకు ఆకర్షించబడిరి.

(4) కృష్ణాజిల్లాలో ప్రతిరోజూ సుమారు 4000 మంది పిల్లలు రోజు భోజనము చేయుచున్నారు. పిల్లవాని 1కి ప్రభుత్వం 0-1-9 చొ॥ యిచ్చేది.

అనగా సంవత్సరంకు 118125 రూపాయలు ఖర్చు అయ్యేది. 4 వేలమంది పిల్లల విద్యాభివృద్ధికి ఉపయోగపడే ఈ చిన్న మొత్తమును తగ్గించి, ప్రభుత్వం యేమి ప్రయోజనం సాధిస్తుందో తెలియదు. కనుక వెంటనే అన్నిచోట్ల తిరిగి యీ ఉచిత భోజనశాలలను తెరిపించవలయునని కోరుచున్నామని బాపనాల ధర్మారావుగారు వ్రాస్తున్నారు.

కర్నూలుజిల్లాలో కరువుసూచనలు

గొనెగండ్ల, ఏప్రిల్ 3

పత్తికొండతాలూకా గొనెగండ్లఫిర్కాలో ఈ సంవత్సరం సరాసరి 0-4-0 పంటకూడ లేదు. కాని ఉద్యోగుల లెక్కలో 0-8-0 పండినట్లు వ్రాశారు. ఇప్పటినుండే మధ్య తరగతి రైతుల ఇండ్లలో కూడ ధాన్యం అయిపోయినవి. ప్రతివారూ ఇంకా ముందు పంటలు వచ్చేంతవరకూ బ్రతుకుదెరువెల్లాగని చింతిస్తున్నారు. కాని బీదరైతులు, కూలీలు అందరు స్టోర్లకెళ్ళి ధాన్యమడిగితే మావద్దలేవు, ఉద్యోగులు కోటాలు సక్రమంగా ఇవ్వడం లేదు, మేమేమీచేయలేమని సమాధానాలు ఇస్తున్నారు. అధికారులు నిస్తబ్ధతగా వున్నారు. ధాన్యంమాత్రం దొరక్క బీద ప్రజలు కూలీలు పస్తులుండవలసి వస్తూంది. ఇప్పటికే దాదాపు 1½ మాసంనుంచి స్టోర్సులో ధాన్యం (రేషన్) ఇవ్వడంలేదు. ప్రజలు ప్రైవేటుగను అడిగితే బ్లాకుమార్కెటులో దొరుకుతాయి తెచ్చుకోండి, కాని స్టోర్సులో ధాన్యం లేదని చెబుతున్నారు. 1 రూపాయకు జొన్నలు, 2½ శేర్లు, సజ్జలు 2 శేర్లు, బియ్యం 1 శేరు, గోధుమలు ¾ శేరు అమ్ముతున్నారు. ఈ ధరలు మామూలు జనానికి అందే స్థితిలో లేకుండా ఆకాశానికి అంటుతున్నాయి.

ప్రభుత్వం వెంటనే కదలి బీదప్రజానీకానికి తిండి సమస్య పరిష్కరించకపోతే, పరిస్థితులు చేజారిపోయి అరాచకానికి దారి దీసేటట్లున్నారు.

రేషను కార్డులున్నా స్టోరులో గింజలులేవు

ఆత్మకూరులో రేషనింగు విఫలత

ఆత్మకూరు, ఏప్రిల్ 6

కర్నూలుజిల్లా ఆత్మకూరు పట్టణకాంగ్రెస్ కార్యదర్శి అంబటి రామిరెడ్డిగారు యిలా వ్రాస్తున్నారు.

ఆత్మకూరు పట్టణం 12వేల జనాభాగలిగి జిల్లాలో మూడవస్థానం ఆక్రమిస్తున్నది ఈ సంవత్సరం జొన్నపంట దెబ్బతినడంతో యిప్పటి బీదప్రజలు తిండికి జొన్నలు దొరకక నానాఅవస్థలు పడుతున్నారు. రేషన్ షాపులో 3 మాసాలనుండి జొన్నలులేవు. బియ్యంమాత్రం కార్డుకు ¾ వంతు యిస్తున్నారు. పేరుకు పట్టణంలో 2600 కార్డులు పంచిపెట్టారు. కాని అకార్డుప్రకారం గింజలిచ్చేవారేవరూలేరు. స్థానికాధికారులు తమకు పట్టనట్లు ఊరకుంటున్నారు. బ్లాకుమార్కెటు ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి

తెనాలిలో బియ్యం కొరత

తెనాలి, ఏప్రియల్ 8

తాలూకా అంతటా బియ్యం కొరతగా వుంది. యేపూళ్ళో చూచినా డిపోల్లో బియ్యం లేవనే వార్తలు వస్తున్నాయి. ధాన్యసేకరణ దాదాపు నిలిచి పోయిందనే అనాలి.

తెనాలి పట్టణానికి వారానికి దాదాపు 1200 బస్తాల బియ్యం కావాలి. హోల్‌సేల్ డిపోల్లో మామూలుగా నాలుగు వారాలకు సరిపోను బియ్యం నిల్వ వుండాలి. అలాంటి డిపోల్లో గిద్దెడు గింజలైనాలేవు. బియ్యం లేనందున, వచ్చే వారంనుండి కరువు పరిస్థితులేర్పడతాయని ప్రజలలో విపరీతమైన ఆందోళనగా వుంది.

ప్రభుత్వం రైతు పండించే ధాన్యానికి న్యాయమైన ధర నిర్ణయించాలనీ, రైతుకు జీవితావసర వస్తువులను కంట్రోలు ధరలకు సప్లయిచేసి ధాన్యం సేకరించి కరువు నివారణకు తోడ్పడాలని రావి హైమారావుగారు వ్రాస్తున్నారు.

తాడికొండ ఫిర్కాలో పేదల పస్తులు

తాడికొండ, ఏప్రియల్ 8

నెల రోజులనుండి గుంటూరుజిల్లా తాడికొండ ఫిర్కాలో బియ్యంలేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. బ్లాకుమార్కెట్‌లో రూపాయికి మూడుసోలలు, లేక సవిగిద్దం చొప్పున కొనలేక కొన్ని కుటుంబాలు పస్తులు వుంటున్నాయి. 2, 3 రోజులనుండి బ్లాక్ మార్కెట్‌లో కూడా దొరకటంలేదు. వ్యవసాయ కూలీలు డబ్బుపట్టుకొని రైతుల ఇళ్ళచుట్టు తిరుగుతున్నారు, కాని ఒక గింజకూడా దొరకటం లేదు. ఈస్థితి ఇలాగేవుంటే పరిస్థితులు విషమించేలాగున్నవి తాడికొండ, పొన్నెకల్లు, రావెల, బేజాతపురం, కర్లపూడి, మైలంతపురం, నిడుముక్కల, నెక్కల్లు, లచ్చాపు గ్రామాల రేషన్ డీలర్లు ఈ నెల 6 వ తేదీన ఫిర్కా సప్లయి ఆఫీసరువద్దకు వెళ్ళి డిపోలకు గింజలు సప్లయి చేయించమని అడిగారు. ఇంకా వారం రోజులుదాకా సాధ్యంకాదని సప్లయి ఆఫీసరు సమాధానం చెప్పారు. ప్రజలలో ఆందోళన ఎక్కువగా వుంది.

తిండి గింజలకై ప్రజాందోళన

తాలూకా కమ్యూనిస్టుకమిటీ విజ్ఞప్తి

గుంటూరు తాలూకాలో నెలరోజులనుండి రేషన్ డిపోలలో బియ్యం లేవు. ప్రజా సామాన్యం దొంగమార్కెట్టు మీద ఆధారపడి కొనుక్కుంటున్నారు. రోజురోజుకు దొంగమార్కెట్టు ధర విపరీతంగా పెరిగి కొన్నిచోట్ల రూపాయికి 8 గిద్దలు బియ్యంకూడ అమ్ముతున్నారు. అదైనా అందరికి దొరకక చాలా కుటుంబాలు పస్తులు పడుకుంటున్నారు. కొంతమంది చిలగడ దుంపలు వండుకు తింటున్నారు. బెంగాల్ పరిస్థితులు వస్తవని ప్రజలు ఆందోళన పడుచున్నారు. ప్రభుత్వంవారు వెంటనే రేషన్ డిపోలకు బియ్యం సప్లయిచేయుటకు పూనుకోనిచో పరిస్థితులు విషమించేటట్లు ఉన్నవి. గనుక వెంటనే ప్రభుత్వం కదలి రేషన్ డిపోలకు బియ్యం సప్లయిచేయాలని ప్రజా సంస్థలు, దేశభక్తులు ఎడతెగని ఆందోళన చేయాలని గుంటూరు తాలూకా కమ్యూనిస్టు కమిటీ కార్యదర్శి విజ్ఞప్తిచేస్తున్నారు.

రెవిన్యూ మంత్రివద్దకు రైతుసంఘరాయబారం

బెజవాడ, ఏప్రిల్ 11

మద్రాస్ రెవిన్యూశాఖా మంత్రి శ్రీ కళా వెంకటరావుగారు ఆంధ్రరాష్ట్ర, కృష్ణాజిల్లా రైతుసంఘాల ప్రతినిధులను మద్రాస్ 12 వ తేదీని వచ్చి జమీందారీవిధానంరద్దు, రైత్వారీ రైతుల స్థితిగతులు, కవులుదారీ సమస్యలపై చర్చించవలసిందిగా ఆహ్వానించారు. ఆహ్వానాన్నంగీకరించి రాష్ట్ర రైతుసంఘం తరఫున శ్రీ. ఎ. కృష్ణారావుగారు, కొల్లా వెంకయ్యగారు, కృష్ణాజిల్లా రైతుసంఘం తరఫున రామినేని పిచ్చయ్యగారు ఈరోజు మద్రాస్ ప్రయాణమై వెళుతున్నారు.

ప్రజాశక్తి చందా

సంవత్సరం చందా	రు. 24-0-0
విడిపత్రిక	0-1-0
వారపత్రిక సం॥ చందా	8-0-0
వారపత్రిక	0-3-0

సిమ్మెంటు ఫ్యాక్టరీ కార్మికుని మరణం

యజమానుల అశ్రద్ధకారణంగా

బెజవాడ, ఏప్రియల్ 11

ఆంధ్రా సిమ్మెంటు ఫ్యాక్టరీలో పని చేస్తున్న మద్దాలి శేషగిరిరావు అనే ఎలక్ట్రిషియన్ క్రేన్ పై నుండి రోలర్సులో పడి చనిపోయాడు.

సిమ్మెంటు ఫ్యాక్టరీ యజమానులు గత నాలుగు సంవత్సరాలనుండీ క్రేన్‌పై వున్న ట్రాలీలో మాగ్నెటు పెట్టకుండా కార్మికుల చేతనే పనిచేయిస్తున్నారు. మాగ్నెటు తో చేయించవలసిన పనిని, మనిషితో చేయించటంవల్లనే యీ ప్రాణ నష్టం జరిగింది.

చనిపోయిన కార్మికుడు, మద్దాలి శేషగిరిరావు వయస్సు 25 సంవత్సరములు భార్యా, కొడుకు వున్నారు. యజమానుల అశ్రద్ధవల్ల నిండు ప్రాణం పోగొట్టుకున్న యీ కార్మికునికి పూర్తిగా నష్టపరిహారం యివ్వాలని, యికముందు యిటువంటి ప్రమాదాలు జరగకుండా సరైన కట్టుదిట్టాలు చెయ్యాలనీ కార్మిక సంఘం ఆందోళన చేస్తోంది.

హంసామిల్ కార్మికుల సమ్మె నోటీసు

రాజమండ్రి, ఏప్రిల్ 2

రాజమండ్రి హంసామిల్ కార్మికులు రు 10 లు అలవెన్సు, నెలజీతం బోనసు యివ్వాలనీ, కార్పెంటర్ల మజూరీలు పెంచాలనీ ఈ మేనేజిమెంటుమకోరుతూ గత 8 నెలలనుంచీ ఆందోళన చేస్తున్నారు. మేనేజిమెంటు అంగీకరించకపోవడం వల్ల మార్చి 28 నుంచి సమ్మె చేయడానికి నిశ్చయించారు. లేబరు కన్సిలియేషన్ ఆఫీసరు కలుగజేసుకొని, లేబరు కమీషనరు ద్వారా పరిష్కరించుతానని యూనియన్‌ని కోరగా, ఏప్రిల్ 10వ తేదీకి సమ్మె వాయిదా వేశారు.

నెల్లూరు ఎలక్ట్రిక్ కార్మికుల సమ్మె నోటీసు

నెల్లూరు, ఏప్రియల్ 8

నెల్లూరుజిల్లా ఎలక్ట్రిక్ కార్మిక సంఘం ఈ నెల 6 వ తారీఖున నెల్లూరు పవర్ అండ్ లైటు కంపెనీవారికి సమ్మె నోటీసు యిచ్చారు. 22 వ తేది రాత్రినుండి సమ్మె ప్రారంభమవుతుంది. ఒక కార్మిక స్త్రీని డిస్‌మిస్ చేయడం, ఇంకొక కార్మికుని సస్పెండు చేయడం .రెండునెలల క్రిందట ఇచ్చిన డిమాండు నోటీసులోని కోర్కెలను మన్నించకపోవడం, పై సమ్మె నోటీసుకు ప్రధాన కారణాలు.

బెజవాడ తోళ్లషాపుల్లో సమ్మె

కార్మిక స్త్రీని కొట్టినందున

బెజవాడ, ఏప్రిల్ 7

బెజవాడలో తోళ్ళషాపులు 9 వున్నాయి. వాటిలో దాదాపు 500 మంది స్త్రీలు పనిచేస్తున్నారు. చాలామంది చిన్న పిల్లలచేతకూడా అసహ్యకరమైన పనులు చేయిస్తున్నారు. సున్నపు నీళ్ళలో తగు పనిముట్లులేక వట్టి చేతులతోనూ, కాళ్ళతోనూ పనిచేయటం మూలాన ఈ తోళ్ళ పనివారందరు అనేక రోగాలకు గురియై బాధలు పడుతున్నారు వీరికిచ్చే కూలీ ఈ రోజులలో పొట్టనిండా కూటికికూడా సరిపోవటంలేదు. ఇట్టి నీచమైన పరిస్థితులలో వున్న వారికి గోరుచుట్టు మీద రోకటిపోటన్నట్లు, యజమానులేకాక వారికొత్తులు మేస్త్రీ లందరు కూడా పెత్తనం చలాయిస్తూ వీరిని దుర్భాషలాడటమే కాకుండా కొట్టటంగూడా జరుగుతుంది. ఇలాగు ఒక స్త్రీకూలీని కొట్టడంవల్లనే కొన్ని రోజులుగా రెండు షాపులలోని కార్మికులు సమ్మెసాగిస్తున్నారు. యజమానులు కార్మికులకు న్యాయం చేయడానికి బదులు పోలీసులను తీసుకొనివస్తామని బెదిరిస్తున్నారు.

నిన్న కార్మికులు లబ్బీపేటలో డాక్టర్ అచ్చమాంబగారి అధ్యక్షతక్రింద సమావేశమయ్యారు. యజమానుల చర్యలను ఖండించారు.

చిలకలూరిపేట సమ్మె ముగింపు

కూలిరేట్ల పెంపుదలకు అంగీకారం

చిలకలూరిపేట, ఏప్రిల్ 8

మార్చి 20వ తేదీనుండి సాగుతున్న చిలకలూరిపేట నేషనల్ టొబాకో కంపెనీ కార్మికులసమ్మె మొన్నటినుండి ముగిసింది. గుంటూరు జిల్లాకలెక్టరు ఎదుట కార్మికులు కోరుతున్న కూలిరేటు పెంపుదలకు (ఒక అణా) యజమాని అంగీకరించాడు. కాని సమ్మెచేసిన కార్మికులందరినీ పనిలోనికి తీసుకోవడానికీ, సమ్మె కాలంలో తెచ్చిన దొంగకూలీలను తీసివెయ్యడానికి యజమాని అంగీకరించలేదు. దొంగకూలీలను తొలగించరాదని, కాంగ్రెస్ యం. యల్. ఏ. కాసు బ్రహ్మానందరెడ్డిగారు పట్టుబట్టడంవల్ల, యజమాని యీ విధంగా ప్రవర్తించాడు. కాని అవసరం వచ్చినప్పుడు పాత కార్మికులనే పనిలో పెట్టుకుంటానని యజమాని మాట యిచ్చాడు.

చిలకలూరిపేట కాల్పులపై విచారణ జరపాలి

గుంటూరు బహిరంగ సభలో తీర్మానం

గుంటూరు, ఏప్రిల్ 7

శాంతియుతంగా పికెటింగ్ చేస్తున్న చిలకలూరిపేట పొగాకు కార్మికులపై సబ్‌ఇనస్పెక్టరు జరిపిన కాల్పులను ఖండించుటకు, నిన్న సాయంత్రం స్వరాజ్యమైదాన్‌లో సిటీ ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్ ఆధ్వర్యాన, నిరసనసభ జరిగింది.

చిలకలూరిపేట కాల్పులపై విచారణ జరిపి, కారకులయిన వారిని శిక్షించాలనీ, గాయపడినవాడికి నష్టపరిహారం యివ్వాలనీ, కార్మికులందరినీ పనిలో చేర్చుకొని వారి మిగతా కోర్కెలంగీకరించాలనీ, డెటిన్యూల కోర్కెలు వెంటనే నెరవేర్చాలనీ, "ప్రజారక్షణచట్టం" రద్దుచేసి అరెస్టయిన వారినందరిని విడుదలచేయాలనీ సభలో తీర్మానాలు చేశారు.

రాష్ట్ర మునిసిపల్ సంఘ నాయకుని ఖండన

రాజమండ్రి, ఏప్రిల్ 5

ఆంధ్రరాష్ట్ర మున్సిపల్, లోకల్‌బోర్డు ఎంప్లాయీస్ యూనియన్ సహాయకార్యదర్శి ముత్యాల చినఅప్పలస్వామిగారు, చిలకలూరిపేటకార్మికులపైపోలీసులుచేసినదౌర్జన్యాలను ఖండిస్తూ, దీనిపై అనధికార విచారణ జరపాలని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ ప్రకటన చేస్తున్నారు.

సత్తెనపల్లి చేనేత పారిశ్రామికుల ఖండన

సత్తెనపల్లి, ఏప్రిల్ 4

మార్చి 30వ తేదీని జరిగిన సత్తెనపల్లి చేనేత పారిశ్రామికుల సభలో, చిలకలూరిపేట కార్మికులపై జరిగిన కాల్పులు ఖండింపబడ్డాయి, అరెస్టుచేసినవారిని వెంటనే విడుదల చెయ్యాలనీ, దౌర్జన్యాలకు గురిఅయిన కార్మికులకు నష్టపరిహారం యివ్వాలనీ, కాల్పులు సాగించిన సబ్‌ఇన్‌స్పెక్టరును శిక్షించాలనీ, రాజీని భగ్నంచేసిన యజమానిపై చర్యతీసుకోవాలనీ తీర్మానించారు. పై తీర్మానాలు తంతిద్వారా మద్రాస్ ప్రభుత్వానికి తెలియజేయబడినవి.

సభకు 700 మంది హాజరయ్యారు.

చిలకలూరిపేట కార్మిక సహాయనిధి

చిలకలూరిపేట, ఏప్రిల్ 6

పోలీసుల తుపాకికాల్పులకూ, యజమానుల దౌర్జన్యాలకూ గురియైన చిలకలూరిపేట నేషనల్ టొబాకో కంపెనీ కార్మికుల సహాయనిధికి యిప్పటివరకూ 185-5-0 లు వసూలైనవని మానిలేజరుతెలియజేస్తున్నారు.

3 లక్షల నిధిని పూర్తిజేయడానికి తాలూకా కమిటీల పోటీ

అనంతపురంజిల్లా

అనంతపూర్, ఏప్రిల్ 8

అనంతపురంజిల్లా ఆర్థికంగా చాలా వెనుకబడిన జిల్లాలలో ఒకటి. అదీగాక ఈ సంవత్సరం సకాలంలో వర్షాలులేక పంటలు పాడైపోయాయి. రేషన్ డిపోలకు గింజలు సరఫరా కావటంలేదు.

చాలా ప్రదేశాలలో యిప్పుడే కరువు సూచనలు గోచరిస్తున్నాయి.

ఈ స్థితిలో కమ్యూనిస్టుపార్టీనిధికి తోడ్పడవలసిందని కామ్రేడ్ సుందరయ్య యిచ్చిన పిలుపు ప్రతివారిని కదల్చింది. ఎక్కడికెడితే అక్కడ వుత్సాహంగా విరాళాలు పోగవుతున్నాయి.

కరిమెల	871 0 0
నరిసిగేకుంట	58 0 0
ఇల్లూరు	500 0 0
అనంతపురం సానుభూతిపరులు	15 0 0
జంబులదిన్నె	18 4 0
ఉరవకొండ సబ్‌తాలూకా	50 0 0
కదిరి	10 0 0
ఏప్రిల్ 8 కి వచ్చిన మొత్తం	1520 4 0

తెనాలి తాలూకా

లోగడ మొత్తం	1884 4 0
దావులూరు	120 0 0
తెనాలి టౌన్	113 0 0
పాంచాలవరం	30 0 0
ఈమని	45 0 0
వందివెలుగు	82 0 0
క్రాప	840 0 0
జంపని	100 0 0
మొత్తం —	2674 0 0

రేపల్లె తాలూకా

రేపల్లె, ఏప్రియల్ 9

రేపల్లె తాలూకా కామ్రేడ్స్ "మే" దినోత్సవం నాటికి తమ కోటాను పూర్తి చేయాలనే పట్టుదలతో పూనిక పలుపని వసూళ్ళ కార్యక్రమంలో మునిగివున్నారు. 3 లక్షల పార్టీనిధికి వసూళ్ళు రోజురోజుకు వుత్సాహకరంగా వుంటున్నాయని తెలుస్తూంది.

రేపల్లె	675 0 0
బేతపూడి	10 0 0
పల్లెకోన	77 0 0
నల్లూరుపాలెం	305 0 0
వాకావారిపాలెం	5 0 0
తూర్పుపాలెం	195 0 0
నెల్లటూరు	146 8 0
ఇస్కపల్లి	50 0 0
రాజోలు	94 0 0
చోడాయపాలెం	40 0 0
బొబ్బర్లంక	83 0 0
గూడవల్లి	25 0 0
ఓలేరు	50 0 0
రాజోలు జవరల్‌వాడీలో	15 8 0
రేపల్లెలో పెళ్ళిసందర్భంలో	25 0 0
	1776 0 0

బాపట్ల తాలూకా

బాపట్ల, ఏప్రిల్ 4

కామ్రేడ్ సుందరయ్య మూడు లక్షల పార్టీనిధి సేకరించాలని యిచ్చిన పిలుపు నందుకొని బాపట్లతాలూకా కామ్రేడ్సు 10వేలు వసూలుచేసి యివ్వాలని నిర్ణయంతీసుకొన్నారు.

మే దినోత్సవంనాటికి 10 వేలకోటా పూర్తిచేయగలమనే వుత్సాహంతో కామ్రేడ్సు కృషిచేస్తున్నారు. నేటివరకూ ఆఫీసుకుచేరిన మొత్తం.

పచ్చలతాడిపర్రు	521 0 0
మన్నవ	30 0 0
మంతుపాలెం,కోడూరు, జూపూడి కుప్పమూర్తిద్వారా	70 0 0
కంకటపాలెం	100 0 0
ఒకసానుభూతిపరుడు వాగులపాలెం	100 0 0
ఒక ఉపాధ్యాయుడు	20 0 0
బాపట్లవ్యవసాయకళాశాలవిద్యార్థులు	37 0 0
మొత్తం	878 0 0

బెజవాడ తాలూకా

బెజవాడ, ఏప్రిల్ 8

బెజవాడ తాలూకాలో పార్టీనిధి వసూళ్ళు చురుకుగా సాగుతున్నాయి. మే దినోత్సవం నాటికి తాలూకా కోటాను పూర్తిచేయడానికి కామ్రేడ్సు వుత్సాహంలో కదలి పనిచేస్తున్నారు. నేటివరకూ ఆఫీసుకు చేరిన మొత్తం.

చినపులిపాక	50 0 0
బొడ్డపాడు	140 0 0
ప్రొద్దుటూరు	140 0 0
తోట్లవల్లూరు	100 0 0
బోడవరం	200 0 0
కంకిపాడు	60 0 0
పెనమలూరు	125 0 0
కోమటిగుంట	90 0 0
పునాదిపాడు	100 0 0
మాదేరుమాక	49 0 0
పెనమకూరు	100 0 0
అట్లూరి రామచంద్రరావు వివాహ సందర్భంలో	10 0 0
మొత్తం	1164 0 0

ఒంగోలు తాలూకా

పి. వి. ఆర్. స్వామిగారు	5000 0 0
కొణికి గ్రామం	125-0-0
మొత్తం	5125 0 0

బందరు తాలూకా

లేళ్ళగరువు	44 0 0

నందిగామ తాలూకా

వీరులపాడు	71 0 0
అనిగండ్లపాడు	36 0 0

చిట్టివలస

చిట్టివలస కార్మికులు	160 0 0

పందలపాక

పందలపాక ఫ్యాక్టరీ కార్మిక యూనియన్	124 8 0

రాష్ట్రకమిటీ వసూళ్ళు

వీరులపాడు	15 0 0
కామ్రేడ్ విశ్వాణిద్వారా	5 4 0
ఇదుపుడు అభిమానులు	200 0 0
కామ్రేడ్ మాధవాచార్య	200 0 0
	420 4 0

కాంగ్రెసువాది విరాళం

(రు.50లు విరాళం పంపుతూ మూల్పూరు వాస్తవ్యులు డాక్టరు వెంకట్రామాచార్యులుగారు వ్రాసినజాబును యీదిగువ ప్రచురిస్తున్నాం:)

మూల్పూరు, మార్చి 22

యుద్ధం ముగిసింది. కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ జాతీయ ప్రభుత్వాలేర్పడ్డాయి. కాంగ్రెస్ నాయకులు స్వరాజ్యం వచ్చేసిందంటున్నారు.

కాని ఈ ఆహారసంక్షోభం, బట్టలకొరత, పప్పు, నూనె, బెల్లం వగయిరా ధరలు, హద్దులుమీరి ఈనాడు ప్రజానీకాన్ని భరించరాని సంక్షోభానికి గురిచేశాయి.

ఈ సంక్షోభంనుండి రాష్ట్రాన్ని తప్పించడానికి బదులు మన జాతీయనాయకులు పదవులకొరకు తగవులాడుకోవటం చాలా విచారకరమైన విషయం.

కమ్యూనిస్టుపార్టీతో నాకు అభిప్రాయభేదాలున్నాయి. కాని దొంగవ్యాపారాన్ని అరికట్టి జీవితావసర వస్తువులను ప్రజలకందజేయడానికి, ప్రధానరాజకీయ పార్టీలలో ఐక్యత తీసుకువచ్చి సంపూర్ణ స్వాతంత్ర్యం సంపాదించడానికి కమ్యూనిస్టులుచేసేకృషి దేశభక్తి యుతమైనదని నేను విశ్వసిస్తున్నాను. పార్టీకి తోడ్పడవలెననే అభిలాషతో రు 50-0-0 లు విరాళం పంపుతున్నాను.

వేదాంతం వెంకట్రామాచార్య.

తణుకు తాలూకా రైతు ప్రతినిధుల సభ

ఏప్రియల్ 20 న కామవరంలో

మధ్యాహ్నం 1 గంటకు సభ ప్రారంభమవుతుంది.

కోవూరు తాలూకా కూలీసంఘ ఎన్నికలు

రామాపురం, ఏప్రిల్ 6

నిన్న రామాపురంలో కోవూరు తాలూకా వ్యవసాయ కూలీ ప్రతినిధుల సమావేశం యం. చిదంబరంగారి అధ్యక్షతను జరిగింది. వ్యవసాయ కూలీ సమస్యలపై కామ్రేడ్ కాశేషు ఉపన్యసించారు.

బంజర్లు వ్యవసాయకూలీలకు పంచివ్వాలనీ, కౌలురేట్లు, కూలిరేట్లు నిర్ణయిస్తూ చట్టంచేయాలనీ, ప్రజారక్షణచట్టం రద్దుచేయాలనీ సభలో తీర్మానించారు. తాలూకా వ్యవసాయ కూలీసంఘానికి యం. చిదంబరంగారు అధ్యక్షులుగాను, షేక్ కాశేషాగారిని కార్యదర్శిగాను, మరి 7 గురు కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. సభకు వివిధ గ్రామాలనుండి 40 మంది ప్రతినిధులు వచ్చారు.

తాలూకా వ్యవసాయ కూలీమహాసభను జరపడానికి నిశ్చయించారు.

ప్రకటన

14-4-47 న ఆంధ్రరాష్ట్రంలోని ఫ్యాక్టరీ కార్మికుల నిరుద్యోగ సమస్యపై కార్మిక మంత్రితో చర్చించుటకుగాను, రాష్ట్ర ఫ్యాక్టరీ కార్మిక ప్రతినిధులు, మద్రాసుకు రాయబారం బయలుదేరాలని ప్రకటించాము. కాని కారణాంతరములచే యీ రాయబారాన్ని వాయిదా వేస్తున్నాము. రావలసిన ప్రతినిధులకు పోస్టుద్వారా మరల వుత్తరములు పంపబడునని తెలియజేయుచున్నాము.

మా. భాస్కరరావు.

ఆంధ్రరాష్ట్ర ఫ్యాక్టరీ వర్కర్సు ఆర్గనైజింగు కమిటీ (ఎ. పి. టి. వి. పి. సబ్‌కమిటీ) బెజవాడ.

నర్సాపురం తంతితపాలా ఉద్యోగుల సభ

నర్సాపురం, ఏప్రిల్ 6

నర్సాపురము సబ్‌డివిజను తంతి,తపాలా ఉద్యోగస్థులసభ పశ్చిమగోదావరిజిల్లా నర్సాపురంలో ది 4-4-1947 న తేదీన శ్రీ గాదె మాణిక్యంగుప్త (బి. యే: బి. యల్)గారి అధ్యక్షతక్రింద జరిగినది. నర్సాపురం సబ్‌డివిజనులోని తంతి, తపాలా ఉద్యోగస్థులు సుమారు 50 మంది హాజరైరి.

తెనాలి తాలూకా మాజీ సైనికుల సభ

ఏప్రిల్ 15 న సంగం జాగర్లమూడిలో

తెనాలితాలూకా మాజీసైనికులసభ ఏప్రిల్ 15 వ తేదీ మధ్యాహ్నం సంగం జాగర్లమూడిలో జరుగుతుంది.

తూ. గో. మునిసిపల్ కార్మిక ప్రతినిధుల సభ

రాజమండ్రిలో ఏప్రెల్ 13 న

రాజమండ్రి, ఏప్రియల్ 6

తూర్పుగోదావరిజిల్లా మునిసిపల్ అండ్ పంచాయతీబోర్డు కార్మిక ప్రతినిధుల సమావేశం రాజమండ్రిలో 13-4-47 ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు జరుగును.

ప్రతి బ్రాంచినుండి ఇద్దరు ప్రతినిధుల చొప్పున హాజరు కావలెనని సమావేశ కర్త ముత్యాల సింహయ్యగారు వ్రాస్తున్నారు.

అమలాపురం తాలూకా కార్మిక ప్రతినిధులసభ

అమలాపురంతాలూకా రైస్‌అండ్‌ఆయిల్ మిల్లు కార్మిక ప్రతినిధుల సమావేశం ఏప్రిల్ 15 వ తేదీన బీమనపల్లిలో జరుగుతుంది.

కూలీ ప్రతినిధుల సభ

అమలాపురం తాలూకా వ్యవసాయకూలీ ప్రతినిధుల సభ ఏప్రియల్ 18 వ తేదీన ఉదయం 10 గంటలకు చెయ్యేరు గ్రామంలో జరుగుతుంది.

మిత్రరాజ్యసమితి కార్యదర్శిపై విషప్రచారం

పదగొట్టడానికి పన్నాగం

వాషింగ్టన్, ఏప్రియల్ 10

మిత్రరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ట్రిగ్వేలీ. ఇతను అభ్యుదయ కాముకుడు. మిత్రరాజ్యసమితి సామ్రాజ్యవాదుల చేతిలో కీలుబొమ్మగా తయారు కాకుండా కాపాడ డానికి కృషిచేస్తున్న వారిలో ఒకడు.

ఇలాంటివాడు ఆ సమితి ప్రధాన కార్యదర్శిగా ఉండడం అభివృద్ధినిరోధకులకు గంటకంగా ఉంది. అతనిపై విషప్రచారం ప్రారంభించారు.

గ్రీసు పరిస్థితులను విచారించడానికి పరిశీలక సంఘాన్ని నియమించడంలో ఇతను సోవియటు పక్షపాతాన్ని కనబరిచాడని అమెరికా సామ్రాజ్యవాద పత్రికలు ఆరోపించాయి. ఆ పరిశీలక సంఘ నివేదిక గ్రీకు ఫాసిస్టు ప్రభుత్వానికి ఎదురు తిరిగే మాదిరిగా కనబడుతున్నాయి. ఆ నివేదిక బయటపడేవరకయినా ఆగకుండా గ్రీకు ప్రభుత్వం దండయాత్ర ప్రారంభించడంకూడా ఇందుకొక నిదర్శనం. ఈ పరిశీలన ఇలా తయారుకావడానికి బాధ్యతను ట్రిగ్వేలీమీద వేయడానికి, ముందుగానే యీ ప్రచారం ప్రారంభించారు.

అంతేకాకుండా, అతను తన పదవికి రాజీనామా యివ్వబోతున్నాడని కూడా వదంతి లేవదీశారు.

ట్రిగ్వేలీ ఈ ప్రచారానికి ఈవేళ జవాబిచ్చారు. తానేమీ రాజీనామానివ్వడంలేదని స్పష్టంచేశారు. తాను సోవియటు పక్షపాతి నవడం అకారణ ఆరోపణ అన్నారు.

ఆల్బేనియా బ్రిటన్ తగాదా

అంతర్జాతీయ కోర్టుఎదుట పెట్టడానికి నిర్ణయం

న్యూయార్కు, ఏప్రిల్ 10

ఆల్బేనియాపై తన ఫిర్యాదును అంతర్జాతీయ న్యాయస్థానం ఎదుటపెట్టడానికి అనుమతి నివ్వాలన్న బ్రిటన్ కోరికపై భద్రతా సంఘంలో నిన్న తిరిగిచర్చజరిగింది. బ్రిటన్ కోరికనెగ్గింది.

లోగడ ఆల్బేనియా సముద్రంలో బ్రిటిష్ నావలు మునిగిపోవడానికి బాధ్యతను అక్రమంగా ఆల్బేనియాకు అంటగడుతూ ప్రతిపాదింపబడిన తీర్మానాన్ని సోవియట్ వీటో చేసింది. దానిపై బ్రిటన్ ఈ కోరికను కోరింది.

అంతర్జాతీయ కోర్టుఎదుట ఈ విషయాన్ని పెట్టడానికి అంగీకరించవని ఆల్బేనియా ప్రతినిధి ఖచ్చితంగా చెప్పారు.

బ్రిటిష్ ఫిర్యాదు పూర్తిగా నిరాధారమైనదని సోవియటు ప్రతినిధి గ్రోమికో ఖండించాడు.

వోటింగులో అమెరికా, ఆస్ట్రేలియా, ఫ్రాన్సు, చైనా మొదలైన 8 దేశాల ప్రతినిధులు బ్రిటన్ కోరికను బలపరిచారు. సోవియటు, పోలెండు ప్రతినిధులు వోటింగులో పాల్గొనలేదు.

సోవియట్ ప్రతినిధులు మద్రాసు వచ్చారు

ప్రధానితో సంభాషించారు

మద్రాస్, ఏప్రియల్ 11

అఖిలాసియామహాసభకువచ్చే సోవియట్ ప్రతినిధులలో 24 మంది నేడు మద్రాసు వచ్చారు. వారిలో 4 గురు సెక్రటేరియట్‌లో ప్రధాని, ప్రభుత్వోద్యోగులనూ కలుసుకొన్నారు.

అక్కడినుండి వారు హైద్రాబాద్ మీదుగా ఢిల్లీ వెళ్ళారు.

ఇండోనీషియా ప్రతినిధులు 12 మంది నేడు బెంగుళూరునుండి ప్రత్యేకవిమానంలో ఇక్కడికి వచ్చారు.

పోలెండును అవమానించి జర్మనీని బలపరచుటకు

బ్రిటన్ అమెరికాల ప్రయత్నం

మాస్కో, ఏప్రిల్ 10

జర్మనీ సరిహద్దులనుగురించి విదేశాంగ మంత్రుల సమావేశంలో నిన్న చర్చ ప్రారంభమయింది.

మొన్నటి యుద్ధానంతరం, మిత్రరాజ్యమయిన పోలెండు క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని జర్మనీ - పోలెండు సరిహద్దులు పోట్సుడం సమావేశంలో నిర్ణయింపబడ్డాయి. పోలెండుమంది జర్మనీ లాక్కున్న ప్రదేశాలు పోలెండుకు ఇచ్చివేయబడ్డాయి.

కాని, పోలెండులో కమ్యూనిస్టు, సోషలిస్టుపార్టీల నాయకత్వాన ప్రజాప్రభుత్వం ఏర్పడిన దగ్గరనుండి బ్రిటన్, అమెరికాలు దానిపై దెబ్బతీయ జూస్తున్నాయి. ఈదృష్టితోనే అమెరికా విదేశాంగమంత్రి జార్జి మార్షల్ నిన్న నాక ప్రతిపాదన పెట్టాడు. పోలెండు జర్మనీ సరిహద్దును నిర్ణయించడానికి ఒక కమిషన్ను వేయాలన్నారు. ఇప్పటి సరిహద్దు తాత్కాలిక సరిహద్దులని పేర్కొన్నారు. ఇప్పటి పోలెండు సరిహద్దులను కాయపరిస్తే, జర్మనీకి వ్యవసాయక ఉత్పత్తిలో బాగా కొరత ఏర్పడుతుందనీ, దానిని దిగుమతులద్వారా పూడ్చుకోవాలంటే పారిశ్రామిక ఉత్పత్తిని పెంచవలసివస్తుందనీ వాదించాడు.

జర్మనీదురాక్రమణతత్వం తిరిగి తలెత్తకుండా చేయాలంటే సరిహద్దులను కొంత ఉదారబుద్ధితో నిర్ణయించాలంటూ, జర్మనీమీద ఎక్కడలేని కటాక్షం వొలకబోశాడు.

ముఖ్య పారిశ్రామిక ప్రాంతమైన జర్మన్ సైలిషియా పోలెండుకు చెందాలని అంగీకరిస్తూ, అక్కడి బొగ్గు మొదలయిన వాటిలో తక్కినదేశాలకు నిడిగావంతుఉండాలన్నారు.

అమెరికా వాదనకు బెవిన్ తాళం

బ్రిటిష్ విదేశాంగమంత్రి బెవిన్ అమెరికా వాదనకు తాళంవేశాడు. పోలెండు శ్రేయస్సు విషయంలో తనకెంతో శ్రద్ధ వుందట. కాని, పోలెండు తన సరిహద్దులను పడమటివైపు చాల దూరం పొడిగించుకుందని ఆరోపించి, అది తప్పన్నాడు.

ఫ్రాన్సు వాదన

జర్మనీ జనాభా చాలపెద్దది; అంత జనాభా ఉండవలసిన ప్రదేశాన్ని చిన్నది చేయడం శాంతికి భంగకరం కావచ్చునని ఫ్రెంచి మంత్రి బిదాల్ వాదించాడు.

పోట్సుడం నిర్ణయాన్ని మార్చకూడదు

మాలొటావ్ పట్టుదల

ఆంగ్లో-అమెరికన్ వాదను మాలొటావ్ తీవ్రంగా ఖండించాడు. పోట్సుడం సమావేశంలో అగ్రరాజ్యాలు పోలెండు సరిహద్దులను న్యాయంగా నిర్ణయించాయన్నాడు.

అంతటితో నిన్నటిచర్చ ఆగింది.

రైన్లాండు సమస్య

ఈవేళ రూర్, రైన్లాండులను గురించి చర్చ జరిగింది.

రైన్లాండును ఒకే రాష్ట్రంగా ఉంచుతారా, కొన్ని రాష్ట్రాలుగా విడదీస్తారా అన్నది తనకు అప్రధానమని ఫ్రెంచి మంత్రి బిదాల్ తెలిపాడు. కాని, ఆరాష్ట్రాన్ని రాజకీయంగా జర్మనీనుండి విడదీసి, మిత్రరాజ్య ఆక్రమణ క్రింద వుంచాలన్నాడు.

రూర్‌ను అంతర్జాతీయంచేయుడం బెవిన్‌కు కంటకం

రూర్ పరిశ్రమలను గురించి చెబుతూ, రూర్ బొగ్గు, ఉక్కు పరిశ్రమలను, జర్మనీపై యుద్ధం చేసిన మిత్రరాజ్యాల ఆస్తిగా ప్రకటించాలన్నాడు. వాటిని నాలుగు అగ్రరాజ్యాలు, పొరుగునున్న ఇతర మిత్రరాజ్యాల అజమాయిషీక్రింద ఉంచాలన్నారు.

బిదాల్ చేసిన రెండు సూచనలను బెవిన్ వ్యతిరేకించాడు. రూర్ పరిశ్రమలను ఆంగ్లో అమెరికన్ అజమాయిషీకిందకాక, నాలుగు అగ్రరాజ్యాల అజమాయిషీకింద ఉంచాలన్న సూచనను అతను మొదటినుంచే వ్యతిరేకిస్తున్నాడు. ముఖ్యంగా సోవియటుకు అక్కడ స్థానమివ్వడం ఇష్టంలేదు.

జర్మనీనుండి మిత్రరాజ్య సేనలను తొలగించే సమస్య తేలేవరకు ఈ విషయాలను ఆలోచించకూడదని అమెరికామంత్రి వాదించాడు.

మాలొటావ్ ఫ్రెంచి సూచనలు చాల ప్రధానమైనవనీ, తన అభిప్రాయాలు రేపు తెలుపుతాననీ అన్నారు.

పోలెండును అవమానిస్తున్నారు

ఆంగ్లో - అమెరికన్ ధోరణి

పోలెండు ప్రముఖుని ఖండన

"పోలెండులోని పడమటి ప్రదేశాలను తిరిగి జర్మనీలో చేర్చడం అసంభవం. ఆలాంటిది తలపెట్టడం మొన్నటి యుద్ధంలో ఎన్నో కష్టనష్టాలను అనుభవించిన పోలెండును అవహేళన చేయడమవుతుంది" అని పోలెండు ప్రభుత్వ ప్రచారకశాఖ ప్రముఖుడు విక్టాల్‌గ్రాజ్ ఆంగ్లో - అమెరికన్ ధోరణిని ఖండిస్తూ అన్నాడు.

"పోట్సుడం నిర్ణయాలు శాశ్వతమైనవి" అని అన్నాడు.

'ఇది సామ్రాజ్య విస్తరణ విధానం'

ట్రూమన్ నిర్ణయంపై శాసనసభ్యుడు క్లాడ్ పెప్పర్

వాషింగ్టన్, ఏప్రిల్ 10

గ్రీసు, టర్కీ ప్రభుత్వాలను బలపరచాలంటూ ట్రూమన్ చేసిన నిర్ణయంపై అమెరికా శాసనసభలో చర్చ సాగుతూంది.

ఈవేళ డెమాక్రటిక్ పార్టీలో అభివృద్ధికర వర్గానికిచెందిన క్లాడ్ పెప్పర్ మాట్లాడాడు. ట్రూమన్ నిర్ణయిస్తున్న విధానం సామ్రాజ్య విస్తరణవిధానమని ఖండించాడు.

"కమ్యూనిజాన్ని సాకుచూపి తీసుకుంటున్న ఈ చర్య మిత్రరాజ్యసంస్థను భగ్నం చేయగలదు. సోవియటుతో సామరస్యానికి ఇక అవకాశం లేకుండా చేయగలదు. అమెరికాను మరొక ఇటలీగానో, పెనుకటి సామ్రాజ్యవాద బ్రిటనుగానో మార్చివేయగలదు. నాగరికత నంతటినీ మట్టిపాలుచేయగల మరో యుద్ధాన్ని మననెత్తిమీద రుద్దగలదు" అని క్లాడ్ పెప్పర్ ఉద్వేగంతో మాట్లాడాడు.

రిపబ్లిక్‌పార్టీ ప్రముఖుడు టాఫ్ట్, డెమాక్రటిక్ పార్టీలోని సామ్రాజ్యవాది టామ్‌కోనల్లీ ట్రూమన్ నిర్ణయాన్ని బలపరచారు.

మిత్రరాజ్యసమితికి నామమాత్ర అధికారాన్నిస్తూ వాండెన్బర్గ్ పెట్టిన సవరణను సెనేట్ ఈవేళ ఆమోదించింది. ఈసవరణకు తనకు ఏమాత్రం ఆక్షేపణలేదని అమెరికా ప్రభుత్వం తెలిపింది.

భద్రతాసంఘంలో చర్చ

న్యూయార్క్, ఏప్రిలు 10

ట్రూమన్ నిర్ణయంపై భద్రతాసంఘంలో చర్చ తిరిగి ప్రారంభమయింది.

గ్రీసులో ప్రస్తుతమున్నది ప్రజాతంత్ర ప్రభుత్వమనీ దానిని పడగొట్టి కమ్యూనిస్టు నియంతృత్వాన్ని స్థాపించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయనీ గ్రీకు ఫాసిస్టు ప్రభుత్వ ప్రతినిధి వాదించాడు. గ్రీసుకు అమెరికా చేయవలసిన సహాయంపై అజమాయిషీకి భద్రతాసంఘం ఒక కమిటీని నియమించాలన్న సోవియటు సూచనను ఆమోదించకూడదన్నాడు.

పోలెండు ప్రతినిధి ఆస్కార్ లాంగే సోవియటు సూచనను బలపరిచాడు. గ్రీసు టర్కీలకు మిలిటరీ సహాయం ఇవ్వడం తగదన్నాడు. "ఆయుధ విసర్జనముగురించి ఆలోచిస్తున్న ఈ సమయంలో గ్రీసు, టర్కీల సైనికబలాన్ని పెంచడానికి అమెరికా ఎందుకు పూనుకోవాలో అర్థం కావడంలేదన్నాడు.

మిత్రరాజ్య సమితి సర్వోత్తమం కాదట

అమెరికా ప్రతినిధి దురహంకారం

అమెరికా ప్రతినిధి వారన్ ఆస్టిన్ మాట్లాడుతూ ఇలా అన్నాడు.

"ప్రస్తుతం మిత్రరాజ్యసమితి, అంతర్జాతీయ వ్యవహారాలను చక్కదిద్దడానికి సర్వోత్తమ సంస్థగా లేదు. అందువల్లనే గ్రీసు, టర్కీలు, తమ రక్షణకోసం అమెరికా సహాయాన్ని అర్థించాయి. వారి కోరికను నెరవేర్చడం అమెరికా ధర్మం. ఇది మిత్రరాజ్య ప్రణాళికకు అనుగుణంగానే ఉంది."

సోవియటు సూచనను రద్దుచేయాలనీ, అమెరికా సూచన ప్రకారం గ్రీసు సరిహద్దు రక్షణ కమిటీని ఏర్పాటుచేయాలనీ అన్నాడు.

చర్చ 14 వ తేదీకి వాయిదా పడింది.

కాంగ్రెస్ మంత్రివర్గం రాజీనామా ఇవ్వదు

సరిహద్దుప్రధాని ఉద్ఘాటన

పెషావర్, ఏప్రిల్ 10

షాబ్‌కాదర్‌లో ఒక బహిరంగసభలో ఉపన్యసిస్తూ సరిహద్దుప్రధాని ఖాన్‌సాహేబ్ ఇలా చెప్పారు:

"సరిహద్దురాష్ట్రంలో కాంగ్రెసు మంత్రివర్గం రాజీనామానిస్తుందని కొందరనుకొంటున్నారు. అది అబద్ధం. సరిహద్దు ప్రజానుల ప్రేమాభిమానాలను చూరగొన్న ప్రజాప్రభుత్వాన్ని ఎవ్వరూ తొలగించలేరు.

"సరిహద్దు కల్లోలాలను వెనకనుండి చర్చిల్ యొక్క భారతమిత్రులు నడిపిస్తున్నారు. చర్చిల్‌కు వాళ్ళదేశంలోకంటె మనదేశంలో అనుచరులు హెచ్చుమందివున్నారు. వారి చేతిలో ముస్లింలీగ్ ఒక కీలుబొమ్మ. లీగర్లు ఇక్కడ చేస్తున్న పనులవంటివానిని ఇంగ్లండులో చర్చిల్ ముఠా చేస్తే వనతెలిసేది.

"హిందూదేశపు రాజకీయాలకు దూరంగా వుండదానికి తమలో తాము ఐక్యత కూర్చుకోమని సరిహద్దు తెగలకు నా విజ్ఞప్తి."

బీరారును తిరిగి నైజాంకు యివ్వరాదు

అమరావతి పౌరుల తీర్మానం

అమరావతి (సి. పి.), ఏప్రిలు 9

నిన్నరాత్రి జరిగిన అమరావతి (మధ్య రాష్ట్రాల) పౌరుల బహిరంగ సభలో 1948 జూన్ తరువాత బీరారును నైజాంకు తిరిగి ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ తీర్మానించారు.

బీరారు భారత యూనియన్‌లో స్వతంత్ర రాష్ట్రంగా ఉండాలని కోరుతూ తీర్మానించారు.

గుంటూరుకు ఇండొనీషియా ప్రతినిధులు రాక

14-4-47 సోమవారం

ఐక్య సన్మానసంఘ స్థాపన

అఖిల ఆసియా మహాసభకు వచ్చిన ఇండొనీషియా ప్రతినిధివర్గం యీ నెల 14 వ తేదీన గుంటూరు వస్తున్నారు. అన్ని పక్షాలతో కూడిన ఐక్య సన్మానసంఘం ఏర్పడింది. సన్మానసభ స్వరాజ్య మైదానములో జరుగుతుంది. వేలాది పౌరులు విదేశీ విప్లవవీరుల స్వాతంత్ర్య సందేశాన్ని విన ప్రార్థన.

ప్రతినిధివర్గం పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ నడింపల్లి నరసింహారావుగారి అతిథులుగా వుంటారు.

స్వతంత్ర సింధు రాజ్యం

లీగు వర్కింగ్ కమిటీలో ఆలోచన

కరాచి, ఏప్రిల్ 8

ఢిల్లీలో జరుగనున్న అఖిలయిండియా ముస్లింలీగు వర్కింగ్ కమిటీ సమావేశంలో స్వతంత్ర సింధు రాజ్యం గురించి చర్చింపుతారట. ఇదివరలో సింధు లీగు అసెంబ్లీపార్టీ ఈ విషయమై ఒక ఉపసంఘాన్ని నియమించింది. సింధు ప్రధానే దానికి అధ్యక్షుడు. స్వతంత్ర సింధు రాజ్యాంగ చట్టం తయారు చేయడానికి ఈ ఉపసంఘం నియమించబడింది.

కొత్తసంస్కరణలకు తిరువాన్కూర్ విముఖత

తిరువాన్కూర్ స్టేటుకాంగ్రెసు మహాసభ తీర్మానాలు

తిరువేంద్రం, ఏప్రిల్ 10

నిన్న సాయంకాలం జరిగిన స్టేటు కాంగ్రెస్ మహాసభలో శ్రీ ప్రకాశంపంతులుగారు ఉపన్యసిస్తూ, తిరువాంకూరు దివాను ప్రవేశపెట్టిన సంస్కరణలను గురించి ఇంకా తాను చదవలేదని చెప్పారు. దివాన్ సర్ సి. పి. రామస్వామి అయ్యరు తనకు బాగా తెలిసినవాడనియూ, 1948 జూన్‌లోపున సంస్థానంలో బాధ్యతాయుత ప్రభుత్వం నెలకొల్పడానికి తప్పకుండా ప్రయత్నిస్తాడని తనకు ఆశ వుందని తెలియజేశారు.

భాషాప్రయుక్త రాష్ట్రం నిర్మాణాన్ని గురించి ప్రసంగిస్తూ మలబార్, కొచ్చిన్, తిరువాంకూర్ కలిసి కేరళరాష్ట్రంగా ఏర్పడడం మంచిదని చెప్పారు.

రాజకీయ తీర్మానం

తిరువాంకూర్ స్టేట్ కాంగ్రెస్ మహాసభలో అనేక తీర్మానాలు చేయబడ్డాయి.

ముఖ్యమైన రాజకీయ తీర్మానంలో ప్రకటించబడిన సంస్కరణలు కూడా ఏమాత్రం అంగీకారయోగ్యంగా లేవని తెలుపుతూ, వెంటనే తాత్కాలిక ప్రభుత్వాన్ని నిర్మించి, వయోజన ఓటింగుపద్ధతితో ప్రజాపరిషత్తు ఏర్పాటు చేయవలసిందిగా కోరారు. తరువాత భారత రాజ్యాంగ నిర్ణయ సభలో సంస్థాన ప్రజాప్రతినిధులకే పాల్గొనహక్కు గలదని తెలియజేశారు.

స్టేటుకాంగ్రెస్ ఆశయసిద్ధి నెరవేరడానికి తగిన అహింసాయుతమైన విధానాన్ని సూచించవలసిందిగా స్టేటుకాంగ్రెసు కార్యవర్గాన్ని కోరుతూ తీర్మానించారు.

ప్రభుత్వానికి స్టేటుకాంగ్రెసు కోర్కెలు నెరవేర్చడానికి కొంతగడువు నిర్ణయించి, ఆ పిదప ప్రత్యక్ష చర్యతీసుకోవాలని ప్రధాన తీర్మానానికి సవరణ యువనాయకులు తీసుకొనిరాగా, పెద్దనాయకులు వ్యతిరేకించారు.

కొంతచర్చ జరిగిన తర్వాత సవరణ ఉపసంహరించుకోబడింది. అసలు తీర్మానం ఓటుకుపెట్టగా నెగ్గింది.

ఐక్యకేరళరాష్ట్ర నిర్మాణమే తమ అభిమతం అని తెలియజేస్తూ మరొక తీర్మానం చేశారు.

కొత్తసంవత్సరానికి తాణుపిళ్లైను అధ్యక్షుడుగాను, పి. కేశవన్‌ను కార్యదర్శిగాను ఎన్నుకొన్నారు.

Edited, Printed & Published by Katragadda Rajagopala Rao at the Prajasakti Press, Mogalrajapuram, Bezwada

END OF ISSUE